సాక్షి
నల్లగొండ
మంగళవారం । 23 । మే । 2023



కుటుంబ పాలనను గద్దె దించాలి

తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలనను గద్దె దింపాలని కేంద్ర మంత్రి మహేంద్రనాథ్‌పాండే అన్నారు. - 10లో



'స్వదేశ్ దర్శన్'లో లేనట్టేనా?

స్వదేశ్ దర్శన్ పథకంలో పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను తొలగించేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. - 10లో

గరిష్టం/కనిష్టం
41°/28°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గవర్నర్ పర్యటన వాయిదా

చందంపేట: చందంపేట మండలం గువ్వలగుట్టలో సోమవారం జరగాల్సిన రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ పర్యటన వాయిదా పడింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా గవర్నర్ పర్యటన వాయిదా పడినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

నల్లగొండ: దళితుల అభ్యున్నతికి భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి సల్మాబాను, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకుడు వెంకటేశ్వర్‌రావు, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, వివిధ శాఖల అధికారులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రామగిరి(నల్లగొండ): సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో న్యాయవాది యుగేందర్‌పై దాడికి నిరసనగా సోమవారం నల్లగొండ జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ తుంగతుర్తి కోర్టు నందు విధులు నిర్వహిస్తున్న న్యాయవాది యుగేంధర్‌పై దాడి చేసిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

కొండమల్లేపల్లి, చింతపల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు హెచ్చరించారు. స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం సభ్యులు సోమవారం కొండమల్లేపల్లి, చింతపల్లితోపాటు అదే మండలంలోని మాల్, కుర్మేడు గ్రామాల్లో గల పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు లేని హెర్బిసైట్ టోలెరెంట్ అనే(హెచ్‌టీ) జీన్స్ రకానికి సంబంధించిన పత్తి విత్తనాలు అమ్మితే చట్టపరంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. రైతులకు విధిగా కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించి ఆయా దుకాణదారులు రశీదులు ఇవ్వాలని పేర్కొన్నారు. రైతులకు నకిలీ విత్తనాలు అంటగంట వద్దన్నారు. ఈ తనిఖీల్లో ఏడీఏలు ఇందుమతి, వీరప్ప, సీఐ నాగరాజు, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ సౌమ్య, ఆయా మండలాల ఏఓలు వెంకన్న, రామలింగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వడవని వడ్లు



కొండమల్లేపల్లి మండలం గుడితండా వద్ద పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

- కేంద్రాల్లో రాశులు పోసి రెండు నెలలైనా పూర్తికాని కొనుగోళ్లు
- వానకు తడిసి ఎండకు ఎండుతున్న వడ్లు
- చిరిగిపోతున్న రాశులపై కప్పిన పట్టాలు
- మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్ల తీరుపై రైతుల అసంతృప్తి
- ఇప్పటి వరకు కొన్నది 5.31 లక్షల మెట్రిక్ టన్నులు

మాడుగులపల్లి: వానాకాలం సాగు సమయం సమీపిస్తున్నా జిల్లాలో చాలా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు 30 శాతానికిపైగా అలానే ఉన్నాయి. సకాలంలో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తికాక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తగా.. టార్పాలిన్లు, పట్టాలు వానకు తడిసి.. ఎండకు ఎండిపోయి ముట్టుకుంటే చిరిగిపోతున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో దొడ్డురకం వడ్లు సాగు చేశామని, అయితే మునుపెన్నడూ లేనివిధంగా ధాన్యం అమ్ముకునేందుకు ఈసారి చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

5.56 లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో గతంతో పోలిస్తే ఈసారి వరిసాగు భారీగా పెరిగింది. ఈ యాసంగిలో 5,56,802 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. 13,72,970 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో రైస్ మిల్లర్లు, వ్యాపారుల కొనుగోలు, స్థానిక అవసరాలు పోగా 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావించారు. ఇందుకోసం ఏప్రిల్ 11నుంచి జిల్లావ్యాప్తంగా 171 ఐకేపీ, 174 పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు ఐకేపీ కేంద్రాల ద్వారా 2,24,000 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా 3,07,489 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇందులో 53 ఐకేపీ, 16 పీఏసీఎస్ కేంద్రాలు మూసివేశారు. ఇంకా ఐకేపీల్లో 40 వేల మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్ కేంద్రాల్లో సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మరో 15 రోజులు సమయమే..!

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు మరో 10 నుంచి 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కేంద్రాల్లో కాంటాలు చకచకా జరుగుతున్నా లారీల కొరత కారణంగా బస్తాల తరలింపులో జాప్యం చోటుచేసుకుంటోంది. తమ అవసరాన్ని ఆసరాగా చేసుకొని కొన్నిచోట్ల లారీ డ్రైవర్లు బస్తాకు రూ.5 చొప్పున డిమాండ్ చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. తాలు, తేమ పేరుతో క్వింటాకు 5 కిలోల చొప్పున మిల్లర్లు కోత విధిస్తున్నారని ఆరోపణలున్నాయి. ధాన్యం రవాణాకు ట్రాక్టర్లను సైతం వినియోగించుకోవాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా అధికారులు దృష్టిసారించడం లేదు. సొంత ట్రాక్టర్లు ఉన్న రైతులు కొందరు చేసేది లేక వారే ధాన్యం లోడు చేసుకొని మిల్లులకు తరలిస్తున్నారు.

కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరం..

సకాలంలో కొనుగోళ్లు పూర్తికాకపోవడంతో కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ధాన్యం ఇంకా అమ్ముడు పోకపోవడంతో పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని వాపోతున్నారు. అప్పులిచ్చిన వ్యాపారులు ఇంటిచుట్టూ తిరుగుతుండడంతో రేపుమాపంటూ సమాధానం చెప్పలేకపోతున్నామని కౌలుదారులు కంటతడి పెడుతున్నారు.

చిరిగిపోతున్న పట్టాలు, టార్పాలిన్లు

దాదాపు నెల పదిహేను రోజులుగా కాంటాలు కాకపోవడంతో చాలా కేంద్రాల్లో రైతులు అద్దెకు తెచ్చి రాశులపై కప్పిన పట్టాలు ఎండకు ఎండి.. వానకు తడిసి పట్టుకుంటే చిరిగిపోతున్నాయి. పట్టాల కిరాయి, చిరిగిన పట్టాలకు పరిహారం చెల్లింపు రైతులకు అదనపు భారంగా మారింది. సన్నాలు సాగు చేసిన రైతులు నేరుగా ధాన్యాన్ని మిల్లులకు తరలించి అమ్ముకుంటే తాము మాత్రం దొడ్డు రకం సాగు చేసి నష్టపోయాయని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం పోసి రెండు నెలలు కావొస్తోంది..



మాడుగులపల్లి కేంద్రంలో ధాన్యం పోసి రెండు నెలలు కావొస్తోంది. ఇంకా కాంటా కాలేదు. 10 ఎకరాలు సాగు చేస్తే అందులో 7 ఎకరాలు కౌలుకు తీసుకున్నదే. పెట్టుబడులకు అప్పులు చేసి పంట పండించాం. ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసి కొంత మొలక వచ్చింది. రాశులపై కప్పిన పట్టాలు చిరిగి పేలికలయ్యాయి. అద్దెకిచ్చిన వాళ్లకి ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదు.

– మండల నాగమ్మ, మహిళా రైతు, మర్రిగూడెం, మాడుగులపల్లి మండలం

లారీల కొరతతో సతమతమవుతున్నాం



లారీల కొరతతో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. లారీల కాంట్రాక్టర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అకాల వర్షాలు పడుతున్నా కనికరం చూపకుండా బస్తాల చొప్పున డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. రైతు సమస్యల్లో ఉంటే మిల్లర్లు, లారీల కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరించడం దారుణం. పరిస్థితులు ఇలానే ఉంటే భవిష్యత్‌లో వరిసాగు కష్టతరం అవుతుంది.

– నేతళ్ల పరమేష్, రైతు, పెండ్లిపాకల, కొండమల్లేపల్లి మండలం

యువతలో క్రీడా స్ఫూర్తి నింపాలి



ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- నల్లగొండలో సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం

నల్లగొండ టూటౌన్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, యువతలో క్రీడా స్ఫూర్తిని నింపాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎన్.భాస్కర్‌రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మానసిక, శారీరక దేహదారుఢ్యానికి క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయని భావించి ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడాంశాల్లో పాల్గొని రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి నుంచి గెలుపునకు నాందిగా భావించాలన్నారు. ఓటమి నుంచే గుణపాఠం నేర్చుకొని మరింత పట్టుదలతో ముందుకు పోతే విజయం వరిస్తుందన్నారు. ఇక్కడ గెలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలిచి జిల్లాకు పేరుకు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఆడి ప్రారంభించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూగుప్తా, భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, స్థానిక కౌన్సిలర్ గోగుల శ్రీనివాస్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

ఎట్టకేలకు రెగ్యులరైజేషన్

- జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోదం
- 648 మంది కార్యదర్శులకు మేలు

నల్లగొండ: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ రెగ్యులరైజేషన్‌కు ఎట్టకేలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోదం తెలిపారు. తమ నాలుగేళ్ల సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో జేపీఎస్‌లు గత నెల 28 సమ్మెబాట పట్టి దాదాపు 16 రోజులపాటు ఆందోళనలు కొనసాగించారు. వీరి సమ్మెకు స్పందించిన ప్రభుత్వం జేపీఎస్‌ల సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇవ్వడంతో ఈ నెల 13న సమ్మె విరమించి విధుల్లో చేరారు. అయితే ఇచ్చిన హామీ మేరకు జేపీఎస్‌ల సర్వీస్ క్రమబద్ధీకరణకు సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోదం తెలిపారు. ఇందుకుగాను జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు వేయాలని ఆదేశించారు. దీంతో జిల్లా యంత్రాంగం కమిటీల నియామకానికి రంగం సిద్ధం చేస్తోంది.

648 మందికి క్రమబద్ధీకరణకు అవకాశం

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని సీఎం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో జిల్లాలో 648 మందికి మేలు జరగనుంది. జిల్లాలో 648 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఉండగా మరో 110మంది రెగ్యులర్ కార్యదర్శులు ఉన్నారు. అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన తీసుకున్న 82 మందిని విషయంలోనూ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంటుందని సీఎం ప్రకటించారు.



కలెక్టరేట్ వద్ద జేపీఎస్‌ల నిరసనకు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు (ఫైల్)

కమిటీల నియామకం ఇలా..

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు కమిటీలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించడంతో జిల్లాలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా ఫారెస్ట్ అధికారి, జిల్లా ఎస్పీ లేదా డీసీపీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీకి రాష్ట్ర స్థాయి నుంచి ఒక సెక్రటరీ స్థాయి లేదా హెచ్ఓడీ స్థాయి అధికారి పరిశీలకుడిగా వ్యవహరిస్తారు. రాష్ట్రస్థాయిలో పీఆర్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఒక కమిటీని వేయనున్నారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా పంపించిన ప్రతిపాదనను రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలిస్తుంది. ఆ తర్వాత రాష్ట్ర స్థాయి కమిటీ.. చీఫ్ సెక్రటరీకి నివేదిక పంపిస్తుంది. అనంతరం సర్వీస్‌ను బట్టి జేపీఎస్‌లకు క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందజేస్తారు. కొన్ని పంచాయతీల్లో తాత్కాలిక ప్రాతిపదికన కలెక్టర్లు నియమించిన జేపీఎస్‌ల స్థానాల్లో కూడా కొత్తవారి భర్తీకి చర్యలు చేపడతారు.

ప్రజలకు శుద్ధమైన నీరు అందించాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: దామరచర్ల మండల ప్రజలకు కలుషితం లేని శుద్ధమైన తాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఆయన వాడపల్లి వద్ద కృష్ణానదిని పరిశీలించారు. టేయిల్‌పాండ్ స్టోరేజ్ వాటర్, మూసీనది నుంచి వచ్చే నీరు ఒక దగ్గర నిల్వ ఉండడం వల్ల నీరు కలుషితమవుతుందని గుర్తించారు. దీంతో వాడపల్లి గ్రామ పంచాయతీ ఎదుట ఆయన నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు, మిషన్ భగీరథ డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. దీంతో వారు స్పందించి వెంటనే శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వినోద్, నాయకులు ఖాజామొహిద్దీన్, పిచ్చయ్య, శ్రవణ్, లక్ష్మయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి గ్రామ పంచాయతీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రంగారెడ్డి, నాయకులు

కేజీబీవీ సిబ్బందికి కనీస వేతనాలివ్వాలి

రామగిరి(నల్లగొండ): కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాన్ని అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. అదనపు కలెక్టర్ భాస్కర్ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.అరుణ, కోశాధికారి ఎస్.శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గేర నరసింహ, నలపరాజు వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు వై.సైదులు, పగిడిపాటి నరసింహ, రాకేష్, పి.సైదులు, రవీందర్‌లు పాల్గొన్నారు. అనంతరం టీఎస్ యూటీఎఫ్ నల్లగొండ జిల్లా కేజీబీవీ సబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రమావత్ సుశీల, కోకన్వీనర్లుగా జె.కల్పన, ఎం.శంకరమ్మ, లక్ష్మీకాంతమ్మ, బి.ప్రభాకర్, పార్వతి ఎన్నికయ్యారు.



ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

వీఓఏల కలెక్టరేట్ ముట్టడి



వేతనాలు పెంచాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వీఓఏలు

నల్లగొండ టౌన్: వీఓఏల వేతనం పెంచేంత వరకు పోరాటం ఆగదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. కలెక్టరేట్‌లోకి చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో 18 వేల మందికిపైగా వీఓఏలు సేవలందిస్తున్నారన్నారు. 36 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీఓఏల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండెంపల్లి సత్తయ్య, నారబోయిన శ్రీనివాస్, కె.శరత్, దుర్గయ్య, జంగయ్య, సైదాబేగం, ఎం.మంగమ్మ, ఆహల్య, కోటిరెడ్డి, సుమీల, రేణుక, చంద్రకళ, నాగమణి, సులోచన, లక్ష్మి, సువర్ణ, చందకళ, సులోచన, సంధ్య, పుష్పలత, మునినాయక్, అజయ్, రాణి, మంజుల, సువర్ణ పాల్గొన్నారు.

ఏడాదైనా అసంపూర్తిగానే..!

సాగుతున్న చర్లపల్లి అర్బన్ పార్కు నిర్మాణం

- ఇప్పటి వరకు 90 శాతం పనులు పూర్తి
- చిన్నచిన్న పనుల విషయంలో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్
- ప్రజలకు అందుబాటులోకి తెచ్చేదెప్పుడో..!

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లిలో అర్బన్ పార్కు పనులు ఏడాది కాలంగా కొనసా...గుతూనే ఉన్నాయి. రూ. కోటి వ్యయంతో గత ఏడాది ఏప్రిల్ నెలలో పార్కు నిర్మాణ పనులు ప్రారంభించారు. హైదరాబాద్ నగరం నుంచి నీలగిరి పట్టణానికి వచ్చే ప్రధాన రహదారికి పక్కనే ఉండే విధంగా పార్కు ఏర్పాటు చేశారు. పార్కు లోపల ఇప్పటి వరకు రెండు వేలకుపైగా వివిధ రకాల మొక్కలు నాటారు. ఇందులో నాటిన పూల మొక్కలు ఆకర్షణీయంగా కనిపించేలా జాగ్రత్తలు కూడా తీసుకొని పెంచారు. ప్రధాన పనులు పూర్తయి నెలల గడుస్తున్నా చిన్న, చిన్న పనులు పూర్తి చేసే విషయంలో సదరు కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పార్కులో చదును చేయకుండా వదిలేసిన ఎర్రమట్టి కుప్పలు

ఎక్కడబడితే అక్కడ ఎర్రమట్టి కుప్పలు

ఇప్పటి వరకు పార్కు లోపల 90శాతం వరకు పనులు పూర్తికాగా.. బయట చిన్న, చిన్న పనులు మాత్రం పెండింగ్‌లో పడి పార్కు అసంపూర్తిగా కనిపిస్తోంది. దీంతో ఈ పార్కు పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేకపోతున్నారు. ఇంకా పార్కులోపల పలు చోట్ల ఎర్ర మట్టి కుప్పలు పోసి ఉంచారు. ఎండాకాలం మొదట్లోనే అందుబాటులోకి తెస్తే వేసవి సెలవుల్లో ప్రజలు పార్కుకు వచ్చేవారు. పార్కు లోపల రోడ్లు అన్ని సీసీ రోడ్డు కాకుండా చిన్న కంకరతోనే ఉంచుతామని, పార్కులో ఒక చోట మా త్రమే చిన్న కంకర కూడా పోయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

ఆకర్షణీయంగా ఉన్నా..

చర్లపల్లి గ్రామం బయట హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారి వెంట పార్కు నిర్మాణం ఆద్యంతం చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ పార్కుకు కేసీఆర్ అర్బన్ పార్కు అని నామకరణం చేశారు. ఈ పార్కు నిర్మాణంపై స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పెట్టించిన సింహం, పులి, కప్ప, నెమలి బొమ్మలు రహదారి వెంట పోయేవారిని ఆకట్టుకుంటున్నాయి. పార్కు బయట వివిధ రకాల మొక్కలు, గ్రీనరీ ఏర్పాటు, పార్కు ఎదుట స్టాల్స్, వేప చెట్టు ఆకారంలో ఉన్న కుర్చీలను కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల బొమ్మలు, గ్రీనరీ, మొక్కలను చూస్తే హైదరాబాద్ నగరం మాదిరిగా కనిపిస్తుంది. ప్రధాన ద్వారం వద్ద గేటును కూడా జింకల ఆకారంతో కూడిన వివిధ రంగుల బొమ్మలువేయడంతో ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

చిగురించని భారీ వృక్షాలు..

నీలగిరి పట్టణంలో రహదారుల విస్తరణ సమయంలో తొలగింపునకు గురైన భారీ వృక్షాలను పార్కులో రీప్లాంటేషన్ పద్ధతిలో నాటించారు. పార్కులో నాటిన ఈ భారీ వృక్షాల్లో ఏ ఒక్క చెట్టు కూడా చిగురించలేదు. చెట్ల రీ ప్లాంటేషన్ కొరకు దాదాపు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసినా ఎలాంటి ఫలితం దక్కలేదు. పైన చెరువులో నీరు పుష్కలంగా ఉండడంతో కింద చెట్ల వేర్లు కుళ్లిపోయినట్లు తెలుస్తోంది.



పార్కులోపల చిగురించని చెట్లు

క్లుప్తంగా

పెట్రోల్ బంక్ వద్ద స్కూటీ దగ్ధం



దగ్ధమవుతున్న స్కూటీ

ఆలేరురూరల్ : ఆలేరు పట్టణ కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద సోమవారం ఓ స్కూటీ దగ్ధమైంది. ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సోయబుల్లా సయ్యద్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేట మండలం దూది వెకంటాపురం గ్రామానికి చెందిన నకిర్త రాములు సోమవారం తన స్కూటీలో ఆలేరు జీఎంజీ స్కూల్ ఎదురుగా ఉన్న వెంకటసాయి పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకున్నాడు. బంక్ సమీపంలోనే స్కూటీ నుంచి పెట్రోల్ లీకై ఇంజన్ మీద పడింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బంక్ సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్న చేసినా ఆగకపోవడంతో స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. వాహనదారుడికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

కనగల్: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం కనగల్ మండలం జి.యడవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మదనపురం స్టేజీ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జి. యడవల్లి గ్రామానికి చెందిన బొమ్మకంటి సాయి, పర్సనబోయిన గోపి అదే గ్రామపంచాయతీ పరిధిలోని మదనపురం నుంచి బైక్‌పై యడవల్లికి వెళ్తున్నారు. అదే సమయంలో చండూరు మండల పరిధిలోని దోనిపాముల గ్రామానికి చెందిన నాగిళ్ల పద్మ, ఆమె కుమారుడు కిరణ్ బైక్‌పై కనగల్ వైపు వస్తుండగా మదనపురం స్టేజీ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొమ్మకంటి సాయి, నాగిళ్ల కిరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ నాగేష్ తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న దొంగల అరెస్ట్

- సుమారు రూ.4లక్షల నగదు, కిలో వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్, వెనుక నిందితులు

సూర్యాపేట క్రైం: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను కోదాడ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ. 4లక్షల నగదు, కిలో వెండి ఆభరణాలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి కోదాడ పట్టణంలోని సీసీరెడ్డి పాఠశాల సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో బైక్‌పై అటుగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపేందుకు ప్రయత్నించగా వారు తప్పించుకొని పారిపోయారు. అనుమానంతో వారిని వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్ద సుమారు కిలో బరువు గల వెండి పళ్లెం, పట్టీలు లభించాయి. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా కోదాడ పట్టణంలోని బంజారా కాలనీకి చెందిన గుంజి వేలాద్రి, అదే కాలనికి చెందిన వేముల బాలక్రిష్ణగా గుర్తించారు. వీరిద్దరు మంచి స్నేహితులు కాగా, ఇద్దరూ ఒకే చోట సుతారీ పని చేస్తుంటారు. ఇద్దరి కుటుంబాల్లో అనారోగ్య సమస్యల కారణంగా అప్పులయ్యాయి. వాటిని తీర్చడం కోసం దొంగతనం చేయాలని భావించారు. అందులో భాగంగా వారికి బంధువు అయ్యే కోదాడలోని అజాద్‌నగర్‌కు చెందిన కారుమంచి శ్రీను నివాసంలో ఈ నెల 15న అర్ధరాత్రి సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో భద్రపర్చిన సుమారు రూ.4లక్షల నగదుతో పాటు కిలో వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. నగదును మాత్రం ఇద్దరూ సమానంగా పంచుకున్నారు. వెండి ఆభరణాలను సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేటలో విక్రయించేందుకు బైక్‌పై వెళ్తూ పోలీసులకు పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. వారి నుంచి రూ.4లక్షల నగదు, కిలో వెండి ఆభరణాలు, ఒక బైక్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుడు వేలాద్రిపై ఖమ్మం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఒక దొంగతనం కేసు, బాలక్రిష్ణపై మేళ్లచెర్వు పోలీస్ స్టేషన్ పరిధిలో పీడీఎస్ బియ్యం విక్రయం కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. చోరీ కేసును త్వరగా ఛేదించిన కోదాడ పట్టణ పోలీసులను ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, పట్టణ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, రామాంజనేయులు, సిబ్బంది ఎల్లారెడ్డి, సతీష్ ఉన్నారు.

ఆలేరు శివారులో ఘోర రోడ్డు ప్రమాదం



ఘటనా స్థలంలో ధ్వంసమైన వాహనాలు



పల్టీకొట్టిన ఆటో, పక్కన కమలమ్మ మృతదేహం

- ఆటోను వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి స్కార్పియోను ఢీకొన్న వైనం
- ఒకరు మృతి, నలుగురికి గాయాలు

ఆలేరురూరల్: ఆలేరు శివారులోని దర్గా సమీపంలో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం 11గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆలేరు ఎస్‌ఐ జి. వెంకటశ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా మరిగడి గ్రామానికి చెందిన గుగులోతు గోపాల్, కమలమ్మ(42) దంపతులు బతుకుదెరువు నిమిత్తం సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండిలో నివాసముంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె మహేశ్వరి గర్భిణి కావడంతో వైద్య పరీక్షల నిమిత్తం జనగామలోని తెలిసిన వైద్యుడి వద్దకు సోమవారం తమ ఆటోలో బయల్దేరారు. మార్గమధ్యలో ఆలేరు శివారులోని దర్గా సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో రోడ్డు ఎడమ వైపునకు పల్టీ కొట్టడంతో ఆటోలో ఉన్న కమలమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. గోపాల్, మహేశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటోను ఢీకొట్టిన కారు అదుపు తప్పి కుడివైపున డివైడర్‌ను దాటుకుంటూ వెళ్లి అవతలి మార్గంలో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న స్కార్పియోను ఢీకొట్టింది. దీంతో స్కార్పియోలో ప్రయాణిస్తున్న వరంగల్‌కు చెందిన టి. మమత, మహేష్, విద్య, నిహాల్, మహితకు స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న వంశీకృష్ణ అతివేగంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. కమలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను వారి బంధువులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్, జనగామ ఆస్పత్రులకు తీసుకెళ్లారు. మృతురాలి కొడుకు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి కేసు నిందితుడు

- 1.5 కిలోల గంజాయి, స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ నరసింహారావు

మిర్యాలగూడ అర్బన్: చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం సీఐ ఎ. నరసింహారావు విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం కాలనీకి చెందిన వాస సాయిశంకర్ చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. గంజాయి సేవిస్తూ ఏ పని చేయకుండా తిరుగుతుండటంతో తన అవసరాలకు డబ్బులు లేక గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని గాంధీనగర్‌లో ఉండే ఓ వ్యక్తి వద్ద గంజాయి కొని చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి తన స్కూటీపై తిరుగుతూ విక్రయిస్తుండేవాడు. సోమవారం పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లైఓవర్ వద్ద ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి అటుగా వస్తున్న శంకర్ పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా విషయం ఒప్పుకున్నాడు. తన స్కూటీలోని 1.5 కిలోల గంజాయి, స్కూటీని సీజ్ చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐలు ఏ. సైదిరెడ్డి, బి. సుధీర్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ పి. వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు ఎస్. వెంకటేశ్వర్లు, ఎం. రామకృష్ణ, షేక్ అక్బర్ తదితరులున్నారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ పి. వెంకటగిరి అభినందించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

పెన్‌పహాడ్: విద్యుదాఘాతంతో గ్రామపంచాయతీ కార్మికుడికి తీవ్రగాయాలపాలైన సంఘటన మండల పరిధిలోని ఎల్లప్పకుంట తండాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. ఎల్లప్పకుంట గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న శంకర్‌నాయక్ ట్రాన్స్‌కో అధికారుల నుంచి ఎల్‌సీ తీసుకొని తండాలో వీధి దీపాలకు మరమ్మతులు చేశాడు. అనంతరం విద్యుత్ సరఫరాను కొనసాగించాలని ట్రాన్స్‌కో సిబ్బందికి తెలియజేయడంతో వారు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కొద్దిసేపటికి వీధి లైట్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారని భావించిన శంకర్‌నాయక్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లను కలపడానికి ప్రయత్నిస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

సామాజిక వెలి వేశారని ఎస్పీకి ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్: గ్రామంలో నూతనంగా నిర్మించిన గుడికి స్థలం ఇవ్వలేదనే అక్కసుతో తన ఇంటి స్థలం గుండా రోడ్డు వేయాలని చేసిన నిర్ణయాన్ని వ్యతిరేకించడంతో తన కుటుంబాన్ని సామాజికంగా వెలివేశారని మిర్యాలగూడ మండలం లావుడితండా గ్రామానికి చెందిన లావూరి పూరి సోమవారం నల్లగొండ ఎస్పీ అపూర్వరావుకు ఫిర్యాదు చేసింది. గుడి నిర్మాణం కోసం తన ఇంటి స్థలంతో పాటు తన మరిది కుమారుడు లావూడి శ్రవణ్, సక్యాల ఇంటి స్థలం కూడా అడిగారని, కానీ దానికి తాము వ్యతిరేకించడంతో ఎలాగైనా తమకు ఇంటి స్థలం లేకుండా చేయాలని ఆ స్థలం గుండా రోడ్డు వేయాలని గుడి కమిటీ నిర్ణయించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు ఒప్పుకోకపోవడంతో గత సంవత్సర కాలంగా సామాజికంగా తమను వెలి వేసి తమ కులం వారు ఎవరూ శుభకార్యాలకు పిలవకపోవడంతో పాటు గుడిలోకి రానివ్వడంలేదని పేర్కొంది. గుడి కమిటీ సభ్యులు లావుడి చందు, లావుడి విజయకాంత్, లావుడి బిచ్యా, లావుడి హాతీ, లావుడి చీను, లావుడి మంగతా, లావుడి సేవా, లావుడి శ్రీహరిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన ఆటోను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగేష్

కనగల్: ఆర్టీసీ బస్సు ప్యాసింజర్ ఆటోను ఢీకొట్టిన ఘటన మండల పరిధిలోని పర్వతగిరి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలంలోని కురంపల్లి గ్రామానికి చెందిన జెట్టి గిరి ఆటోలో నల్లగొండ నుంచి చండూరుకు ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నాడు. మార్గమధ్యలో పర్వతగిరి గ్రామ శివారులోకి రాగానే ఆర్టీసీ బస్సు(టీఎస్ 05 యూఎఫ్ 0795) డ్రైవర్ పన్నీరు అంజయ్య అతివేగంతో వస్తూ ముందున్న కారును ఓవర్‌టేక్ చేయబోయి ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న లింగమ్మ, పార్వతమ్మ, మహేంద్రమ్మకు తీవ్రగాయాలు కాగా మరికొంత మంది ప్యాసింజర్లకు స్వల్పగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అంజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి

మోత్కూరు: మోత్కూరుకు చెందిన కూరెళ్ల రవి తన సెల్‌ఫోన్ పోయిందని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రర్(సీఈఐఆర్) పోర్టల్ సహాయంతో సెల్‌ఫోన్‌ను కనిపెట్టి సోమవారం బాధితుడు రవికి ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే నూతన టెక్నాలజీతో వీలైనంత త్వరగా పట్టుకొని అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

జన విజ్ఞాన వేదిక మాజీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మృతి



పాదూరి శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లా జన విజ్ఞాన వేదిక మాజీ కార్యదర్శి పాదూరి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. నల్లగొండ పట్టణ శివారు గ్రీన్‌హిల్స్ కాలనీలో రోడ్డుపక్కన పడి ఉండగా స్థానికులు గుర్తించారు. ఆయన పక్కన స్కూటీ కూడా కింద పడి ఉంది. శ్రీనివాస్‌రెడ్డి మృతికి సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సంతాపం తెలిపారు.

మొలకెత్తిన ధాన్యాన్ని తీసుకోం



మోత్కూరు మార్కెట్‌లో ధాన్యం పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ డీఎం గోపికృష్ణ, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి

మోత్కూరు: ఇటీవల కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాలలో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని తీసుకోమని సివిల్ సప్లయ్ డీఎం గోపికృష్ణ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకాలు, ఎగుమతి, రవాణాలో తీవ్రమైన జాప్యం జరుగుతుందని, మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని సోమవారం మోత్కూరు ప్రాంతం నుంచి పలువురు రైతులు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లై డీఎం గోపికృష్ణ, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి మోత్కూరులోని నాలుగు రైస్ మిల్లులను సందర్శించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి తూకాలు వేయించాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని తీసుకుంటామని చెబుతుందని రైతులు ప్రశ్నించగా.. తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని డీఎం రైతులకు తెలిపారు. నాలుగు మిల్లులకు ఒక్కో మిల్లుకు రోజుకు రెండు లారీల లోడ్ చొప్పున ధాన్యం ఎగుమతి చేస్తున్నామని, నాలుగైదు రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట మార్కెట్ కార్యదర్శి ఎదుళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు సేవా సహకార సంఘం సీఈఓ కె. వరలక్ష్మి, కోఆర్డినేటర్ పెండెం నరహరి, మిల్లర్లు ఉన్నారు.

శరత్‌బాబుకు సాగర్‌తో అనుబంధం

నాగార్జునసాగర్: సినిమా హీరో శరత్‌బాబుకు నాగార్జునసాగర్‌తో అనుబంధం ఉంది. అల్ఫా ఒమేగా క్రియేషన్స్ పతాకంపై నిర్మించిన 'మేమూ మీలాంటి మనుషులమే' సినిమాలో శరత్‌బాబు హీరోగా నటించారు. ఇందులోని పాటలను నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ వెనుక భాగాన చిత్రీకరించారు. ఈ సినిమాకు కె.వి.ఫణీంద్ర దర్శకత్వం వహించారు. శరత్‌బాబు(డాక్టర్ ఆనంద్), దీపా(శిరీషా)నరసింహరాజు, వరలక్ష్మీ, పుష్పలత, రాళ్లపల్లి, మేమసుందర్, అనంతహృదయరాజ్ నటించారు. ఈ సినిమా 1984 ఆగస్టు 15న విడుదలైంది.

కారు డోరులో తల ఇరుక్కొని బాలిక మృతి



ఇంద్రజ (ఫైల్)

అనంతగిరి: కారు డోరులో తల ఇరుక్కొని బాలిక మృతిచెందిన ఘటన మండలంలోని బొజ్జగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొజ్జగూడెం గ్రామానికి చెందిన భూక్యా కోట్యా కుమార్తె వివాహం సోమవారం జరిగింది. వివాహం అనంతరం నూతన వధూవరులు కారులో వెళ్తుండగా వారితో పాటు కారు వెనుక సీటులో బానోతు వెంకటేశ్వర్లు కుమార్తె ఇంద్రజ(9) కూర్చుంది. ఈ క్రమంలో ఇంద్రజ కారు డోరులోంచి తల బయట పెట్టి డ్యాన్స్ చేస్తుండగా డ్రైవర్ శేఖర్ అద్దం పైకి లేపడంతో ఊపిరాడక చనిపోయింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మున్సిపల్ కార్యాలయం తరలింపు

- పక్కనే ఉన్న ఫంక్షన్‌హాల్‌లోకి మార్పు
- నూతన భవనం నిర్మించే వరకు ఇక్కడి నుంచే సేవలు

సాక్షి ఎఫెక్ట్..



నూతన మున్సిపల్ భవనం వద్ద అధికారులు, పాలకవర్గ సభ్యులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయాన్ని పక్కనే ఉన్న ఫంక్షన్‌హాల్ అండ్ లాడ్జిలోకి మార్చారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ తాత్కాలిక భవనాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడం, గది పైకప్పు పెచ్చులూసి పడడంతో ఇటీవల ఓ ఉద్యోగికి ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో 'భయం భయంగా విధులు' అనే శీర్షికతో ఈనెల 8న సాక్షి కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన పాలకవర్గం కార్యాలయాన్ని తాత్కాలికంగా మరో చోటకు మార్చాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మున్సిపల్ ఆధీనంలో ఉన్న ఫంక్షన్‌హాల్, లాడ్జిలోకి తరలించారు.

నూతన భవనానికి త్వరలోనే శంకుస్థాపన

ప్రస్తుతం ఉన్న మున్సిపల్ భవనాన్ని కూల్చివేసి దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మించనున్నారు. త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్ తెలిపారు. నూతన భవనానికి రూ.3.20 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు పిలువనున్నట్లు వెల్లడించారు. నూతన భవనం పూర్తయ్యే వరకు ప్రస్తుతం తీసుకున్న ఫంక్షన్‌హాల్ అండ్ లాడ్జి భవనం సేవలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్లు గౌళికార్ అరుణ, బూడిద సురేందర్, సీస విజయలక్ష్మి, గుండ్లపల్లి వాణి, సరోజ, ముక్కెర్ల మల్లేష్, తాళ్లపల్లి నాగరాజు, ఆవుల మమత, బబ్బూరి మౌనిక, దండబోయిన అనిల్, కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, సయ్యద్‌బాబా, గోర్ల పద్మ, రిజ్వానా, ఇంచార్జ్ కమిషనర్ చక్రపాణి, మేనేజర్ నరేష్‌రెడ్డి, ఏఈ నవీన్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ నర్సింహ, కృష్ణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.







